
సాక్షి
చిత్తూరు

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



మామిడి ఉత్పాదకత పెంచాలి

మామిడి ఉత్పాదకత పెంచాలని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ పేర్కొన్నారు. చిత్తూరులో రైతులు, కొనుగోలుదారులతో సదస్సు నిర్వహించారు. - 10లో



కల్వర్టును కూల్చిన ఘనుడు

కాంట్రాక్టు పనుల కోసం బాగున్న కల్వర్టును కూల్చిన ఓ తెలుగు తమ్ముడు నిర్వాకం కత్తెరపల్లె పంచాయతీలో చోటు చేసుకుంది. -10లో



పచ్చనేత విధ్వంసం

నాయకనేరి వద్ద గతంలో వేసిన రోడ్డును కూటమి నేత జేసీబీతో ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

చిత్తూరు కార్పొరేషన్ : రెండో శనివారం ప్రభుత్వం సెలవు రోజు అయినప్పటికీ యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతాయని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. క్రయవిక్రయదారులకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. వీటితో పాటు జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు పని చేస్తాయని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా పునఃనిర్మాణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ పూజలను శుక్రవారం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, బింబ స్థాపన పూజలను వేద మంత్రోచ్ఛరణాలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, మణినాయుడు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో నియమాకాలు చేపట్టారు. చిత్తూరు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో పలు హోదాల్లో చోటు కల్పించారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలను ప్రకటించింది. రాష్ట్ర విద్యార్థి విభాగంలో ఉపాధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్, కార్యదర్శిగా నరేష్, సంయుక్త కార్యదర్శిగా కలయన్ భరత్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగంలో ప్రధాన కార్యదర్శులుగా ఉపేంద్రరెడ్డి, పదార్థి రాధకృష్ణారెడ్డి, కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ఉపాధ్యక్షుడిగా అవిలా లోకనాథరెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ విభాగంలో కార్యదర్శిగా డాక్టర్.సైమన్‌సీజర్‌బండారు, సంయుక్త కార్యదర్శిగా సురేంద్రకుమార్‌ను నియమించారు.

కదం తొక్కిన పాత్రికేయలోకం



జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

అక్షర స్వేచ్ఛ హరణ.. భావవ్యక్తీకరణకు బంధనం.. పాత్రికేయులపై అక్రమ కేసులు.. జర్నలిస్టుల గొంతు నొక్కాలన్న యత్నం.. బెదిరింపు ధోరణలకు నిరసనగా పాత్రికేయలోకం శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కదం తొక్కింది. ర్యాలీలు.. నిరసనలు.. ఆందోళనలు చేపట్టింది. అక్షర స్వేచ్ఛ కల్పించాలని, కేసులు ఉపసంహరించుకోవాలని ఉన్నతాధికారులకు పాత్రికేయులు వినతి పత్రాలు అందజేశారు.

సాక్షిపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- చిత్తూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేత
- ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన.. సీఐకి వినతి

చిత్తూరు అర్బన్: పాత్రికేయులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, జర్నలిస్టులను అణగదొక్కాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చిత్తూరులో పాత్రికేయలోకం కదం తొక్కింది. ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, చిత్తూరు ప్రెస్‌క్లబ్, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రెస్‌క్లబ్, తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు నగరంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లోకనాథన్, మురళీకృష్ణ, చిత్తూరు ప్రెస్ క్లబ్ కార్యదర్శి కాలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం, ఆర్డీఓ కార్యాలయం వరకు పాత్రికేయులు వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లోకనాథన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల గొంతుపై కేసులు పెట్టి పాత్రికేయులను లోబరచుకోవాలని చూస్తోందన్నారు. పల్నాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్యకు గురైన వార్తలు రాసినందుకు ఆరుగురు పాత్రికేయులతోపాటు, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై క్రిమినల్ కేసులు పెట్టడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పత్రికలో ప్రచురితమైన వార్తలో అభ్యంతరం ఉంటే ఖండించడం, న్యాయపరంగా ముందుకు వెళ్లడం చేయాలే తప్ప, ఎవరో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ రాజ్యాగం కల్పించిన భావవ్యక్తీకరణ ప్రకటనను హరించడమేనన్నారు. రాష్ట్ర డీజీపీ సైతం కనీస న్యాయ సలహా తీసుకోకుండా పాత్రికేయులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడం మంచిది కాదన్నారు. ఈ నిరసన కార్యక్రమం అనంతరం చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులను కలిసి సాక్షి పాత్రికేయులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయప్రకాష్, ఉపాధ్యక్షులు శివకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, వెంకటేష్ , చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు పవన్, శివకుమార్, కార్యవర్గ సభ్యులు చంద్ర, రాజేష్, బాలసుందరం, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమలయ్య, నరేష్, తేజ, ఎంజీఆర్, తవణంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జగన్నాథం, శివకుమార్, అనంత్ కుమార్, పాత్రికేయులు హేమంత్ కుమార్, ప్రవీణ్, జయకుమార్, ఐరాల చిన్న, కిషోర్ పాల్గొన్నారు.



చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట పాత్రికేయులు నిరసన వ్యక్తం చేసి, వన్‌టౌన్ సీఐ మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు జయరాజ్, ప్రకాష్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టిందన్నారు. ప్రభుత్వం కేసులు పెట్టి పాత్రికేయులను బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా క్రిమినల్ కేసులు పెట్టారని, ఇలాంటి చర్యలను ఉపేక్షించేదిలేదన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే జర్నలిస్టులు జిల్లాల వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ పాత్రికేయ సంఘ నాయకులు బాలసుబ్రమణ్యం, మురళీ, కృపానంద రెడ్డి, కేశవులు, నీరజాక్షులు, జయచంద్ర, వరదరాజులు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ హరించడం సబబుకాదు

- పలమనేరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేత



పలమనేరు ఆర్డీఓ భవానీకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పలమనేరు: పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వాలు హరించడం సబబుకాదని, పత్రికలను అణగదొక్కాలని గతంలో అనుకున్న పార్టీలు ఆపై కనిపించకుండా పోయాయని పలమనేరు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్, దిలీప్ అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కేసు నమోదుకు వ్యతిరేకంగా స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలసి శుక్రవారం నిరసన తెలిపి ఆపై స్థానిక ఆర్డీఓ భవానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికల్లో వెలువడే వార్తలను పార్టీలకు అంటగడుతూ ఎడిటర్లపై కేసులు నమోదు చేయడం కరెక్ట్ కాదన్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. పత్రికలో వచ్చిన వార్త తప్పుగా ఇంటే దానిపై ఖండన, రీజయిండర్ ఇవ్వాలి గానీ, ఇలా కేసులు పెట్టడం, దాన్ని పోలీసులు అమలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాసామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై కేసులు పెట్టడం భవిష్యత్తులో అనర్థాలకు దారితీయడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఇలాంటి తప్పుడు కేసులపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఇలాంటి సంస్కృతి కొనసాగితే రేపు మరోపార్టీ అధికారంలోకి వచ్చాక ఇలాంటివి పునరావృత్తం కావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇందులో ప్రెస్‌క్లబ్ సభ్యులు రెడ్డెప్ప, సుబ్రమణ్యం, రంజిత్, సూర్యబాబు, సాక్షి మణి, మోహన్‌మురళి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,462 మంది స్వామివారిని దర్శించుకోగా 22,998 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.94 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చీటీ నిర్వాహకుడిపై దాడి



గాయపడిన సెల్వరాజ్

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లిలో శుక్రవారం చీటీ నిర్వాహకుడిపై చీటీలోని సభ్యులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సెల్వరాజ్ చీటీలు నడుపుతున్నాడు. చీటీల విషయంగా గొడవ తలెత్తి ఆదే గ్రామానికి చెందిన లోకనాథం, కుమార్ బండరాయితో అతనిపై దాడి చేశారు. గాయపడిన సెల్వరాజ్‌ను స్థానికులు పలమనేరు ఆస్పత్రికి తరలించారు. బాధితుని పిర్యాదు మేరకు పోలీసులు కేసును విచారిస్తున్నారు.

పూలే స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణించాలి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే



పూలే చిత్రపటానికి నివాళులర్పించి.. సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : మహాత్మ జ్యోతిబాపూలే స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదట పీసీఆర్ సర్కిల్ లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందజేసే సంక్షేమ పథకాలు ఉపయోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. జ్యోతిబా పూలే సంఘ సంస్కర్తగా ఎన్నో సేవలందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళలకు చదువు నేర్పించాలనే ఉద్దేశంతో పూలే సతీమణి సావిత్రిబాయి పూలే దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సేవలందించారని తెలిపారు. ఆమె చూపిన బాటలో నేడు ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలు పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువత, మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. మహిళలకు కుట్టు మిషన్ ల శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారన్నారు.జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ..

మానవ వికాసానికి, మనుగడకు ప్రధాన భూమిక పోషించే విద్య ప్రాధాన్యంను పూలే తెలియజేశారన్నారు. ఆ నాటి సమాజంలో ఉన్న అసమానతలను వివక్షను రూపుమాపేందుకు విశేష కృషి చేశారన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ మాట్లాడుతూ.. పూలే సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం జిల్లాలోని బీసీ మహిళలకు, యువతకు 535 మందికి రూ.11.58 లక్షల విలువ చేసే వివిధ పథకాల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, బీసీ సంఘాల నాయకులు రవి, బోడప్ప, నాగరాజు, భరత్ పాల్గొన్నారు.

పూలే జీవితం అందరికీ ఆదర్శం

చిత్తూరు అర్బన్ : జ్యోతీరావ్ పూలే జీవితం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ మణికంఠ సూచించారు. కుల వ్యవస్థ నిర్మూలన, అంటరానితనం రూపుమాపడం, మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో ఆయన చేసిన కృషి సమాజం మరిచిపోదన్నారు. జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్ర పటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. సంఘ సంస్కర్త, విద్యావేత్తగా ఉన్న పూలే కుల వ్యవస్థను పారదోలడానికి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు మహబూబ్ బాష, చిన్ని కృష్ణ, సీఐలు శ్రీవాసంతి, చంద్రశేఖర్, నాగరాజు, ఆర్ఐలు సుధాకర్, భాస్కర్, ఏవో నాగ భూషణమ్మ పాల్గొన్నారు.

ఫలితాలపై పరేషాన్ వద్దు !

పరీక్షా ఫలితాల సమయంలో ర్యాంకులు రాలేదని కొందరు.. మార్కులు తక్కువ వచ్చాయని ఇంకొందరు.. ఎక్కువ మార్కులు రాలేదని మరి కొందరు..ఫెయిల్ అయ్యామని కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. పరీక్షా ఫలితాల వేళ క్షణికావేశ నిర్ణయాలు మంచివికాదు. విద్యార్థి ప్రతిభకు మార్కులు గీటురాయి కాదు. మార్కుల ఆధారంగా తెలివితేటలు అంచనా వేయడం సరైందికాదు. పిల్లల మార్కులను తల్లిదండ్రులు ప్రతిష్టగా భావించడం తప్పు. ప్రపంచంలోని మేథావులంతా ఎక్కువ మార్కులు సాధించిన వారేంకాదు.. విద్యా సంస్థల యాజమాన్యాలు మార్కుల వెంట పరుగెత్త కూడదు. పరీక్షలే సర్వస్వం కాదు.. జీవితం ఎంతో ఉందని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక కథనం.

- క్షణికావేశం కాదు.. క్షణం ఆలోచించండి
- ప్రతిభకు మార్కులు కొలమానం కాదు
- పరీక్షలే సర్వస్వం అనుకోవద్దు
- నేడు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ మూల్యాంకనం పూర్తి అయ్యింది.. విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాల విడుదల సమయం రానే వచ్చింది. శనివారం ఉదయం 11 గంటలకు పరీక్షా ఫలితాలు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అయింది. ఫలితాల సమయంలో విద్యార్థులు క్షణికావేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు, మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 139 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల నుంచి విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్షలకు దాదాపు 30 వేల మంది హాజరయ్యారు.

విద్యార్థులకు మంచి జీవితం ఇవ్వాలని ఆశించేది తల్లిదండ్రులే. కంటికి రెప్పలా చూసుకుంటూ.. వారి బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది తల్లిదండ్రులే. పిల్లలకు ఏ చిన్న దెబ్బ తగిలినా తమకే తగిలినట్లు విలవిలలాడేది తల్లిదండ్రులే. అయితే అలాంటి తల్లిదండ్రులకు ధైర్యంగా ఉండాల్సిన విద్యార్థులు పలుచోట్ల ఆత్మహత్యలకు పాల్పడి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. అయితే తల్లిదండ్రులు కూడా అంతగా ప్రేమించే వారిపై మార్కుల ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని విద్యావేత్తలు చెబుతున్నారు.

దండించొద్దు..ధైర్యం చెప్పండి..

ఇంటర్ ఫలితాలు శనివారం విడుదల కానున్న నేపథ్యంలో ఫలితాల్లో ఎవరైనా ఫెయిల్ అయితే వారిని దండించకుండా ధైర్యం చెప్పాలి. ఇంటర్ ఫెయిల్ అయినప్పటికీ విద్యార్థులకు సప్లిమెంటరీ రూపంలో మరో అవకాశం ఉంటుంది. అది రాసి మళ్లీ పాస్ కావచ్చు. ఉన్నత విద్యకు అర్హత సాధించవచ్చు. ఫెయిల్ అయ్యామని చులకనగా చూసే సమాజం ముందే తలెత్తుకుని జీవించవచ్చు. అవేమీ ఆలోచించకుండా క్షణికావేశంలో విద్యార్థులు మనోవేదనకు లోనుకావద్దు. పరీక్ష తప్పామని, ర్యాంకులు రాలేదని, ఎక్కువ మార్కులు తెచ్చుకోలేదని, వారిని ఒత్తిడికి గురిచేస్తే క్షణికావేశానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. తల్లిదండ్రులు ఫలితాల సమయంలో పిల్లలపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకూడదని విద్యావేత్తలు వెల్లడిస్తున్నారు.

ఫలితం ఎలా ఉన్నా..



పరీక్షల ఫలితాలు అంటేనే చాలా మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో కంగారు ఉండటం సహజమే. ఫలితాలు ఎలా ఉంటాయో....తమకు ఫలితాలు ఎలా వస్తాయోనని విద్యార్థులు సైతం టెన్షన్ పడటం సహజమే. కానీ, పరీక్షల ఫలితం ఎలా వచ్చినా ఆందోళన చెందకూడదని, రిజల్ట్స్ ఎలా ఉన్నా పాజిటివ్‌గా స్పందించాలని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. అనుకున్న దాని కంటే తక్కువ మార్కులు వచ్చాయని, చదివిన చదువుకు తగిన ఫలితాలు రాలేదని అతిగా స్పందించాల్సిన అవసరం లేదంటున్నారు. ఒక్క ఓటమితోనే తమ చదువు ముగిసిపోదని, ఉత్తమ ఫలితాలు సాధించగానే హీరోలైపోరని గుర్తించాలని వెల్లడిస్తున్నారు.

ఈ విషయాలు మరువొద్దు..

- ఫలితాలు ఎలా వచ్చినా.. విద్యార్థులు పాజిటివ్‌గా తీసుకోవాలి. విద్యార్థులతో పాటు కుటుంబం, స్నేహితులు, అధ్యాపకులు, చుట్టు పక్కల వారు ప్రవర్తించే తీరు ప్రభావం చూపుతుంది.
- ఫెయిలైన విద్యార్థి ఇంతటితోనే అంతా అయిపోయిందనే భావనను వీడాలి. ఓ పరీక్షలో మాత్రమే ఫెయిలయ్యామని, జీవితంలో కాదన్న విషయాన్ని గ్రహించాలి.
- ప్రధానంగా క్షణికావేశానికి గురికాకూడదు. తొందరపాటుగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. తమలోని బాధను పంచుకోవడంతో పాటు నెగిటివ్ ఆలోచనలను దూరం పెట్టాలి.
- సభ్యులు, స్నేహితులు, చుట్టు పక్కల వారు ఫెయిలైన విద్యార్థులపై చులకన భావంతో ఉండకూడదు. స్నేహితులు, బంధువులు వారిని ఎగతాళి చేసినట్లు మాట్లాడొద్దు.
- వారికి తల్లిదండ్రులు, స్నేహితులు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తారో, ఫెయిలైన వారిని కూడా అలాగే వెన్నుతట్టి ప్రోత్సహించాలి.
- ఫెయిలైనా జీవితంలో విజేతలుగా నిలిచిన వారి గురించి తెలియజేయాలి. ఆలోచిస్తూ బాగా చదివేలా వారిని ప్రోత్సహించాలి.
- ఇన్ని చెప్పినా విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు	139
పరీక్షలకు హాజరైన ప్రథమ సంవత్సరం విద్యార్థులు	15,639
హాజరైన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	15,074
మొత్తం విద్యార్థులు	30,713


జీవితం నష్టపోదనే భరోసా ఇవ్వాలి



ఒకసారి పరీక్షల్లో తప్పితే జీవితం నష్టపోదనే భరోసానివ్వాలి. మళ్లీ చదివి పాస్ కావచ్చనే ధైర్యం నింపాలి. పాస్ కాలేదని తిట్టకుండా, వేధించకుండా సముదాయించాలి. తిరిగీ మంచిగా చదివి పాసయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా క్షణికావేశానికి లోనుకాకుండా సమస్యను స్నేహితులు, తల్లిదండ్రులు, సన్నిహితంగా ఉండే టీచర్లతో చర్చించాలి. మార్కులు కాదు విజ్ఞానమే ముఖ్య మనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, గంగాధర నెల్లూరు

ఓ కన్నేసి ఉంచాలి...



నేడు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదల అవుతున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు క్షణికావేశానికి లోనయ్యే అవకాశం ఉంటుంది. అధ్యాపకులు, తల్లిదండ్రులు మార్కులు తక్కువ వచ్చినా.. ఫెయిల్ అయిన విద్యార్థులను చిన్నచూపు చూడకూడదు. విద్యార్థి ప్రతిభకు మార్కులు కొలమానం కానే కాదు. విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురాకూడదు. జీవితంలో ఏదైనా సాధించాలనే కసి, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగిన వారే ఏదైనా సాధిస్తారు. ప్రపంచ విజేతలుగా నిలుస్తారు.

– సయ్యద్ మౌలా, ఇంటర్మీడియట్ డీవీఈఓ, చిత్తూరు జిల్లా

కాణిపాకంలో సినీనటి అప్సర



సినీ నటికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం రాత్రి సినీనటి అప్సర దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు దర్శనం భాగ్యం కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో అభిమానులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

న్యాయమూర్తులకు సన్మానం



జిల్లా జడ్జి భీమారావును సన్మానిస్తున్న న్యాయవాదులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరులో పనిచేసి బదిలీపై వెళుతున్న ఇద్దరు న్యాయమూర్తులను శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. చిత్తూరులో పనిచేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్ సేవలు మరువలేనివన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వీరు చూపిన చొరవ అభినందనీయమన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదులతో కలిపి కక్షిదారులకు సత్వర న్యాయం అందించారని కొనియాడారు. అనంతరం న్యాయమూర్తులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాద మండలి అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథ రెడ్డి, చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌నాయుడు, సురేష్‌రెడ్డి, న్యాయమూర్తులు రమేష్ , శ్రీనివాసులు, భారతి, మాధవి, వెన్నెల పాల్గొన్నారు.

దుప్పిని రక్షించిన గ్రామస్తులు



బంగారుపాళెం : మండలంలోని జిల్లేడుపల్లెలో శుక్రవారం కుక్కల బారిన పడిన దుప్పిని గ్రామస్తులు పట్టుకుని అటవీశాఖ అధికారుల అప్పగించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఓ దుప్పి నీటి కోసం వ్యవసాయ పొలాల సమీపంలోకి రావడాన్ని ఊర కుక్కలు గుర్తించి దాడి చేశాయి. ప్రాణ భయంతో దుప్పి జిల్లేడుపల్లె గ్రామంలోకి పరుగులు తీసింది. ఈ విషయాన్ని గుర్తించిన మాజీ సర్పంచ్ జ్యోతీశ్వర్‌రెడ్డి గ్రామస్తుల సహకారంతో దుప్పిని రక్షించారు. విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అటవీశాఖ అధికారులు జిల్లేడుపల్లె గ్రామానికి చేరుకొని దుప్పిని స్వాధీనం చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం దుప్పిని అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



గుడిపాల : విద్యుదాఘాతంతో ఓ పాడి ఆవు మృతి చెందింది. గుడిపాల మండలంలోని సీకేపల్లె గ్రామానికి చెందిన గోవిందరాజులునాయుడు అనే రైతు తన పాడి ఆవును పొలం వద్ద చెట్టుకు కట్టి ఉండగా విద్యుత్ తీగలు గాలికి చెట్టుకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై పాడి ఆవు మృతి చెందింది. పాడి తనకు జీవనాధారమని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ రైతు కోరారు.

దిక్కు దిక్కునా ధనం

- పొరిగింటి రోడ్లపై రూ.కోట్లు కుమ్మరింపు
- పోటీ తప్పిస్తూ.. సింగిల్ టెండర్లకు ఆమోదం
- 'పచ్చ' నేతలకే పనులు.. ఇద్దరికే రూ.కోట్ల కట్టలు
- పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లకు మున్సిపల్ నిధులు



పీసీఆర్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన దుకాణాల షెడ్లు



మ్యాంగో భవన్ వద్ద చేస్తున్న పీఆర్ రోడ్డు పనులు

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం నిధుల ప్రవాహం పారుతోంది. ఖజానాలోని నిధులను పాలకవర్గం ఓ స్థాయిలో ఖర్చు చేస్తోంది. నగర అభివృద్ధికి నిధులు ఖర్చుపెట్టడంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందేమీ ఉండదు. పైగా అందరూ స్వాగతిస్తారు. కానీ తమకు సంబంధం లేని రోడ్లపై రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. కాగా నగర నడిబొడ్డున, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ప్రధాన రోడ్లపై పనులు చేయడం సులభంగా ఉండడం, పైగా రూ.పది పెట్టుబడి పెడితే.. రూ.4 లాభం వస్తుండడంతో కాంట్రాక్టర్లకు ఇష్టారాజ్యంగా పనులు అప్పగిస్తున్నారు. తొమ్మిది నెలల కాలంలో దాదాపు రూ.3.5 కోట్ల విలువైన పనులను ఇద్దరు 'పచ్చ' నేతలకే అప్పగించారు.

కొత్త సంప్రదాయం..

రూ.50 లక్షల్లోపు అభివృద్ధి పనులకు పాన్, ఐటీ రిటర్న్స్, కంపెనీ రిజిస్ట్రేషన్ ఉంటే రెండో దశలో ఫైనాన్స్ బిడ్ చూస్తారు. రూ.50 లక్షలకు పైబడిన పనులకు అనుభవం తప్పనిసరి. ఇందులో తక్కువ మొత్తం కోట్ చేసిన వారికి పనులు ఇవ్వాలి. కానీ ఓ పని చేయడానికి ఇద్దరి కంటే ఎక్కువ టెండర్లు దాఖలైతే పోటీలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి 'తాము ఈ టెండర్ల నుంచి తప్పుకుంటున్నట్లు' ఓ కాగితంతో రాసి సంతకాలు పెట్టి, అధికారులకు ఇస్తున్నారు. దీంతో పోటీలో ఉన్న ఒకే వ్యక్తికి పనులు అప్పగిస్తూ అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు. 40 పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిస్తే.. అన్నీ సింగిల్ టెండర్లనే ఆమోదించారు. రామ్‌నగర్ కాలనీలోని జనసేన పార్టీకి చెందిన కాంట్రాక్టర్ చేత బలవంతపు సంతకాలు తీ సుకున్నట్లు తెలుస్తోంది. దీని వెనుక అధికార పార్టీకి చెందిన కీలక వ్యక్తి చక్రం తిప్పుతున్నట్లు ఆ పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమికి చెందిన ఒకే ఒక్క కాంట్రాక్టర్‌కు రూ.5 కోట్ల విలువైన 30 పనులు అప్పగించారు.

చిక్కులు తప్పవా?

నగరంలో ఫారెస్టు–పీవీకేఎన్ కళాశాల దారిలో దాదాపు రూ.80 లక్షల కార్పొరేషన్ నిధులు వెచ్చించి రోడ్డు పనులు చేస్తున్నారు. వాస్తవానికి ఇది పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్డు. ఆ శాఖలో నిధులు లేవా..? అంటే పుష్కలంగా ఉన్నా యి. అయినా సరే కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చడానికి ఇలా చేస్తున్నారనే విమర్శలున్నాయి. పీసీఆర్ పాఠశాల కూడలిలో దాదాపు రూ.40 లక్షల వ్యయంతో పండ్ల దుకాణాల కోసం షెడ్లు వేసి, నిర్మాణాలు పూర్తి చేశారు. ఇది ఆర్ అండ్‌బీ శాఖకు చెందిన రోడ్డు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ జరిగితే ఈ షెడ్లు మొత్తం తీసేయాల్సిందే. అయినా సరే పాలకులు కార్పొరేషన్ నిధులను నేలపాలు చేస్తున్నారు. జిల్లా కోర్టు వద్ద నిర్మిస్తున్న ప్రహరీ గోడకు రూ.40 లక్షలపైనే నిధులు వెచ్చిస్తున్నారని, ఇది ఆర్అండ్‌బీ శాఖకు చెందిన రోడ్డని ఇటీవల డిప్యూటీ మే యర్ చంద్రశేఖర్ కౌన్సిల్ సమావేశంలో నిలదీసినా స్పందనలేదు. పాలకులు చెప్పిందల్లా చేస్తూ పోతే, చట్టపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సిందేననే విషయాన్ని అధికారులు విస్మరిస్తున్నారు.

నగరంలో వసతులు శూన్యం

కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో కనీస వసతుల్లేవు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రజల సదుపాయాల కోసం కొట్టుమిట్టాడుతున్నారు. ఇవేమీ పట్టని పాలకు లు నలుదిక్కులా ఉన్న పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల కోసం నిధులను మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. ఇది విమర్శలకు దారితీస్తోంది.

హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జోన్–4 పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ (గవర్నమెంట్ మేనేజ్‌మెంట్) నుంచి గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులు (గవర్నమెంట్) కు ఉద్యోగోన్నతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. సంబంధిత స్కూల్ అసిస్టెంట్‌ల జాబితా rjdsekadapa.blogspot.com లో పొందుపరిచినట్లు చెప్పారు. ఈ జాబితాను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ లోపు అందజేయాలని ఆర్జేడీ వెల్లడించారు.

రేపు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సుందరరాజపురం వద్ద ఉన్న విజయం పాఠశాలలో ఈనెల 13న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల డిమాండ్లు, పలు అంశాలపై చర్చించేందుకు జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టరేట్‌లో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం
- పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఈఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 21 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఆ కేసుల పరిష్కారంలో దాదాపు రూ.1,72,500 చెల్లించడం జరిగిందన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి..

సమావేశంలో డీవీఎంసీ సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పుంగనూరు పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహంలో 113 మంది బాలికలున్నట్లు తెలిపారు. అయితే నాలుగే మరుగుదొడ్లు ఉండడం వల్ల బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పుంగనూరు మండలం ఎస్టీ కాలనీ వద్ద అనాథ ఆశ్రమానికి 5 ఎకరాల భూమిని మంజూరు చేయాలన్నారు. ఎస్టీలలో సంప్రదాయ కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సదుం మండలంలో యానాదుల అనుభవంలో ఉన్న భూములను అగ్ర కులస్తులు ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, ఆర్డీవోలు, డీఎస్పీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సెలెస్టాలో తళుక్కుమన్న ...నేపాలీ తార



సెలెస్టాలో నేపాలీ తార, మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

కాణిపాకం : సెలెస్టాలో నేపాలీ తార నితిషా తళుక్కుమంది. చిత్తూరు నగరంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సెలెస్టా 2కే 25 ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సంప్రదాయ కళలు, జానపద సాహిత్యం, ఆధునిక హిప్ హాప్ షోలు అదుర్స్ అనిపించాయి. బ్యాండ్ షో మోత మోగించింది. అనంతరం నేపాలీ తార నితిషా విద్యార్థులతో ముచ్చటిస్తూ ఉత్సాహ పరిచారు. తదనంతరం ఎస్పీ మణికంఠ ఛందోలు మాట్లాడుతూ.. విద్యార్థి దశ అత్యంత కీలకమన్నారు. ఈ దశ నుంచి భవిష్యత్తును ఎంచుకోవాలన్నారు. ఇప్పటి నుంచే గోల్ కోసం పట్టుపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్లు రావూరి వెంకట స్వామి, రావూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో నటుడు వరుణ్ సందేశ్

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం సినీ నటుడు వరుణ్ సందేశ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన భాగ్యం కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

పరిహారం కుదింపుపై ఆందోళన

- అడుగుకు రూ.154 పరిహారంపై మండిపాటు
- బైరెడ్డిపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే పనుల వద్ద ఉద్రిక్తత



స్థలాల యజమానులను అడ్డుకుంటున్న పోలీసులు

బైరెడ్డిపల్లి : పరిహారం మరీ ఇంత తక్కువ ఇవ్వడం ఏంటి సార్ అంటూ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు పోగొట్టుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండగానే అధికారులు, పోలీసుల బందోబస్తు మధ్య స్థలాలను స్వాధీనం చేసుకున్న ఘటన మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎక్స్‌ప్రెస్ హైవే వారు స్థలాల్లో జేసీబీలు, టిప్పర్లతో చదును చేసేందుకు రాగా రైతులు అడ్డుకున్నారు. దీంతో పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న పోలీసులు రైతులను పక్కకు తప్పించి స్థలాలను ఎక్స్‌ప్రెస్‌హైవే వారికి స్వాధీనం చేయించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు బాధితులు తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. బెంగళూరు– చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా బైరెడ్డిపల్లిలో జంక్షన్ కోసం భూములను సేకరించారు. ఇందులో చెక్ పోస్ట్ పక్కన ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన 25 మంది దాకా ఉన్నారు. ఇంటి స్థలాలు కాబట్టి అప్పటి సబ్ కలెక్టర్ వీరికి అడుగుకు రూ.1640 చొప్పున అవార్డు ఇచ్చేలా నిర్ణయించారు. కానీ ఆపై జేసీ వచ్చి ఈ ధరను రూ.154కు తగ్గించారు. దీనిపై కడుపు మండిన కొందరు బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కొందరు మాత్రం అధికారుల మాట నమ్మి ఇందుకు అంగీకరించారు. దీంతో ఇన్నాళ్లు ఇక్కడి పనులు పెండింగ్ పడ్డాయి. అయితే ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో పోలీసుల పహారా మధ్య భూములు, స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. నష్ట పరిహారం తక్కువ అనుకునే రైతులు జేసీ కార్యాలయంలో ఆర్బిట్రేషన్‌కు రావాలని అధికారులు సూచించారు. పనులను అడ్డుకున్న రైతులను పోలీసులు పక్కకు తప్పించి పనులు చేయించారు. దీంతో మొత్తంగా చదును జరిగిపోయింది. చేసేదీ లేక రైతులు బాధ పడుతూ నిరాశతో తిరుగుముఖం పట్టారు.

పచ్చనేత విధ్వంసం



రోడ్డును పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, గ్రామస్తులు

- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- జేసీబీతో రోడ్డును తవ్వుతున్న వైనం
- బిల్లులు నిలిపేందుకు కుట్ర

వి.కోట : అధికార మదంతో కొంత మంది పచ్చనేతలు మండలంలో అరాచకపర్వానికి దిగుతున్నారు. వి.కోట–పెర్నంబట్ జాతీయ రహదారిలోని ఏడుచుట్లకోట నుంచి చింతమాకులపల్లి, కాంచిమిట్టపల్లి, బోయచిన్నాగనపల్లి లను కలుపుతూ నాయకనేరి వద్ద జాతీయ రహదారులు కలిసేలా సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీటీ, సీసీ రోడ్లను మంజూరు చేయించి ఎంపీపీ యువరాజ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ప్రజాభిష్టాన్ని నిలబెట్టాలనే సంకల్పంతో ఎంపీపీ రూ.1.47 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఓ టీడీపీ నేత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షల రూపాయలతో వేసిన రోడ్డును తవ్వాలని కంకణం కట్టుకుని మరోసారి శుక్రవారం పసలమంద గ్రామం వద్ద వేసిన రోడ్డును నంబర్ లేని ఓ జేసీబీతో తవ్వాలని ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తెలుగు తమ్ముడి విధ్వంసాన్ని అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డును వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్ పరిశీలించారు. వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేందుకు పూనుకున్న తెలుగు తమ్ముడిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బీటీ రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇప్పటికీ ఇంకా బిల్లులు చెల్లించలేదు. బిల్లులు రాకుండా చేయడానికి టీడీపీ నేత ఈ కుట్రకు తెరలేపాడని కాంట్రాక్టర్ వాపోతున్నారు.

కాంట్రాక్టు పనుల కోసం.. కల్వర్టును కూల్చిన ఘనుడు

- ప్రశ్నించేందుకు భయపడుతున్న అధికారులు
- ఇదీ ఓ తెలుగు తమ్ముడి నిర్వాకం



కృష్ణాపురం జలాశయం ఎడమ కాలువపై ఉన్న కల్వర్టును కూల్చేసిన తెలుగు తమ్ముడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కాంట్రాక్టు పనుల కోసం బాగున్న కల్వర్టును కూల్చిన ఓ తెలుగు తమ్ముడి ఘన కార్యమిది.. కూటమి నాయకుల కుట్రలకు .. జగనన్న కాలనీ లబ్ధిదారులకు శాపంగా మారింది. మండలంలో ఒక షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఓ చోటా తెలుగు తమ్ముడు తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఎమ్మెల్యేకి నేను ఎంత చెబితే అంతే అంటూ.. వారితో కలిసి దిగిన ఫొటోలను అధికారులకు చూపించి అక్రమాలు చేస్తూ చెలరేగిపోతున్నాడు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా.. కత్తెరపల్లి పంచాయతీ పరిధిలోని సిద్ధేశ్వర ఆలయ సమీపంలో 2014లో అప్పటి ప్రభుత్వం డంపింగ్ యార్డు నిర్మాణం చేసింది. అయితే కృష్ణాపురం జలాశయం ఎడమ కాలువ అడ్డంగా ఉండడంతో కాలువపై కల్వర్టు నిర్మాణం చేశారు. అనంతరం 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డు సమీపంలో జగనన్న కాలనీ పేరుతో పక్కా గృహాలు మంజూరు చేసింది. అయితే జగనన్న కాలనీకి వెళ్లే లబ్ధిదారులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు, సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు అనుకూలంగా ఉన్న కల్వర్టును ఆ చోటా తెలుగు తమ్ముడు రాత్రికి రాత్రే జేసీబీతో కల్వర్టును కూల్చి అందులో ఉన్న సిమెంట్ పైపులను తన సొంతానికి వాడుకున్నాడు. అలాగే అదే కల్వర్టు స్థానంలో నూతనంగా కల్వర్టు నిర్మాణం చేసి ప్రజాధనాన్ని దోచుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కల్వర్టును కూల్చిన సమాచారం తెలిసినా ప్రశ్నిస్తే ఉద్యోగాలు ఉంటాయో.. ఊడుతాయోననే భయంతో అధికారులు నోరెత్తడం లేదు. ఆ పచ్చనేత ఆగడాలు మండలంలో మితిమీరి పోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ఉత్పాదకత పెంచాలి

- రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ డైరెక్టర్ శ్రీనివాస్
- చిత్తూరు నగరంలో ఉద్యాన పంటల సదస్సు
- హాజరైన మామిడి రైతులు, కొనుగోలుదారులు
- గిట్టుబాటు ధర కల్పించాలన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



స్టాల్స్ పరిశీలనలో రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్, కలెక్టర్, అధికారులు, రైతులు, సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు జిల్లాలో మామిడి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని, ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు భవనంలో శుక్రవారం మామిడి రైతులు, కొనుగోలుదారులతో ఉద్యాన పంటల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులతో పాటు చిత్తూరు నగర మేయర్ అముద, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో మామిడి ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఒక హెక్టార్‌కు 12 మెట్రిక్ టన్నులు ఉండగా..దేశంలోని గుజరాత్ లాంటి రాష్ట్రాలలో ఒక హెక్టార్‌కు 15 వేల మెట్రిక్ టన్నుల ఉత్పాదకత ఉందని, ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలో ఒక హెక్టార్‌కు సుమారు 9 మెట్రిక్ టన్నులు ఉండగా బ్రెజిల్ లాంటి దేశాలలో 20 నుంచి 25 మెట్రిక్ టన్నులు ఉత్పాదకతను కలిగి ఉందన్నారు. ఉత్పాదకత లేని మామిడి తోటలను తిరిగి పునరుజ్జీవం చేసేలా పంట తెగులు నివారణపై శాస్త్రజ్ఞులతో పరిశోధనలు చేయిస్తున్నామని, బయో లిక్విడ్ వాడకం ద్వారా భూసారం పెంచగలిగితే ఉత్పాదకత పెరిగే పరిస్థితి ఉందని, తద్వారా గతంలో రూ. 5 వేల వరకు ఆదాయం పొందే రైతు రూ.30 వేల వరకు ఆదాయం చూడొచ్చన్నారు.

70 వేల హెక్టార్లలో మామిడి..

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉత్పత్తి పరంగా, నాణ్యతా పరంగా చిత్తూరు జిల్లా మామిడికి చాలా ప్రాధాన్యం ఉందన్నారు. జిల్లాలో దాదాపు 75 వేల మంది రైతులు మామిడి పంటపై ప్రధానంగా ఆధారపడి ఉన్నారన్నారు. దాదాపు 90 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు ఉండగా అందులో 70 వేల హెక్టార్ల వరకు మామిడి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.25 కోట్లతో మామిడి పంట విస్తరణ, క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు.

మామిడికి మార్కెట్ సౌకర్యం కల్పించాలి

జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు అధికంగా మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, మామిడి పంట, ఇతర పంటలను విక్రయించడానికి తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక సదస్సును ఏర్పాటు చేసి పరిష్కార మార్గం చూపాలని భావించిందన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు క్యూ లైన్ , నడకదారిలో ఉచితంగా అందిస్తున్న ఆహారం, పాలు, మజ్జిగతో పాటు మామిడి జ్యూస్‌ను కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని అసెంబ్లీలో నివేదించామన్నారు. రైతు సంఘ నాయకులు మామిడిబోర్డు ఏర్పాటు చేయాలని వినతి చేశారు. ఉద్యాన పంటల మార్కెటింగ్‌కు సంబంధించి కల్‌గుడి–ఫో కనెక్ట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అదనపు సంచాలకులు హరినాథ్ రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మైక్రో ఇరిగేషన్ వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవ మునిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ఉద్యాన, వ్యవసాయ, ఏపీ ఎంఐపీ, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు మధుసూదన్ రెడ్డి, మురళీ కృష్ణ, బాల సుబ్రమణ్యం, శోభారాణి, సైంటిస్టులు సంబంధిత అధికారులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి



చిత్తూరు కలెక్టరేట్ : ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్నం సురేంద్రరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల నూతన కార్యవర్గం ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుండారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి పెద్దిరాజుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతానని చెప్పారు.

ముగిసిన గ్రేడ్-3 ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రెండు రోజుల పాటు చేపట్టిన గ్రేడ్–3 ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ ప్రజావేదిక భవనంలో కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఉద్యోగోన్నతి ప్రక్రియను గతేడాది ప్రారంభించారు. 307 మందితో కూడిన జాబితాను సిద్ధం చేశారు. జాబితా చివరి దశకు చేరుకుని కౌన్సెలింగ్ పూర్తి చేసుకుంది. కలెక్టర్ అనుమతి పూర్తి అయితే ఉద్యోగోన్నతికి అర్హులైన వారికి ఆర్డర్ కాపీలు ఇవ్వనున్నారు.